క్లుప్తంగా

విద్యుత్ స్తంభం మార్పు



అధికారుల సమక్షంలో స్తంభం మార్పు

పాలకొండ: పట్టణంలోని ఏలాం జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అడ్డంగా వేసిన విద్యుత్ స్తంభాన్ని గురువారం విద్యుత్ శాఖ అధికారులు మార్పు చేశారు. నూతనంగా స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సమయంలో విగ్రహానికి అడ్డంగా వేశారు. దీనిపై దళిత సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. స్పందించిన అధికారులు స్తంభాన్ని మార్పు చేసి వేరే స్థలంలో వేశారు.

ఓటర్ల సర్వే పరిశీలన

సీతంపేట: ఓటర్ల సర్వేను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి గురువారం పరిశీలించారు. మండలంలోని జి.గుమ్మడ, దబర గ్రామాల్లో చేస్తున్న ఓటర్ల సర్వే చూశారు. ఓట్లను తొలగించేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. సర్వేలో బీఎల్‌వోలు మాత్రమే పాల్గొని పారదర్శకంగా చేయాలన్నారు. సర్వే నివేదికలు ప్రతీరోజు మండల రెవెన్యూ కార్యాలయానికి సమర్పించాలన్నారు.

నాడు - నేడు పనుల పరిశీలన

భామిని: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు - నేడు పనులను పార్వతీపురం మన్యం డీవీఈవో పి.మంజుల వేణి గురువారం పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఎర్రంనాయుడుతో కలిసి నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించి తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన నిధులతో విద్యార్థులకు అత్యవసరాలు పూర్తి చేయాలన్నారు. తరగతి గదులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ప్రహరీ నిర్మాణానికి అవసరమైన సిమెంట్ విడుదలైన తరువాత నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల కోసం వచ్చిన పరికరాలను పరిశీలించారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో గ్రామీణులు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.చిరంజీవి అన్నారు. మండలంలోని జంపరకోట సచివాలయ పరిధి వెంకటరాయునివలస గిరిజన గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో గల నీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించారు. వీధి కాలువల్లో మలాథియాన్, దోమల నివారణా మందులు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.భూలక్ష్మి, ఏఎన్‌ఎం టి.రామలక్ష్మి, హెల్త్ సహాయకులు ఎ.పెంటయ్య తదితరులుర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: లుంబూరు రహదారిలోని జగనన్న అర్బన్ కాలనీలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు నిర్వహిస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పంచాయతీ పరిధిలో 11 కేవీ విద్యుత్ సరఫరాకు సంబంధించి టౌన్-1 ఫీడర్ పరిధిలో యాలం కూడలి, నవోదయ నగర్‌లో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మున్సిపల్ మహిళా కార్మికుల దీక్షలు

పాలకొండ: మున్సిపల్ మహిళా కార్మికులు గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా పలు రకాల నిరసన కార్యక్రమాలు చేపట్టిన వీరు గురువారం నుంచి నగరపంచాయతీ కార్యాలయం ఎదుట దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా దావాల రమణారావు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కాకుంటే సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. శిబిరాన్ని మహిళా న్యాయవాది పద్మలత, బి.అమరవేణి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్.హిమప్రభ, జి.జెస్సీబాయ్, మల్లేశ్వరి పడాల రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు చెక్

పాలకొండ రూరల్: సమగ్ర భూ సర్వే ప్రక్రియతో దీర్ఘకాలంగా పేరుకుపోయిన భూ సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. పట్టణ శివారులో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. సర్వే బృందాలకు పలు సూచనలు చేశారు. భూ హక్కుదారుల, రైతుల సహకారంతో సకాలంలో సర్వే పూర్తి చేయాలన్నారు. బంగాళా ఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న క్రమంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. శుక్రవారం సర్వే నంబర్ 197 నుంచి 201, 265 - 267, 269 మధ్య (అచ్చుత మిల్లు వెనుక భాగం)లో ఉన్న తోటల్లో రోవర్ సహాయంతో సర్వే చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత రైతులు, హక్కుదారులు పూర్తి వివరాలతో సర్వేకు హాజరు కావాలన్నారు.

'జగనన్న సురక్ష' ఓ నూతన అధ్యాయం

● ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



వీరఘట్టం: వండవలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరిగేలా ముఖ్యమంత్రి నూతనంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ఓ నూతన అధ్యాయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వీరఘట్టం మండలం వండవ గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వీరు పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను కూడా ఈ పథకం ద్వారా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. గతంలో మన రాష్ట్రాన్ని ఎందరో పరిపాలించారని అయితే వీరిలో పారదర్శక పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా సి.ఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి మాత్రమే నిలిచారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం గత కొద్ది రోజులుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు వీరు ధ్రువపత్రాలను అందజేశారు. అలాగే సంత-నర్సిపురం గ్రామంలో డ్వామా పీడీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు విశ్వాసరాయి భార్గవ్, పర్రి విజయకుమారి, సర్పంచ్‌లు మిడితాన కల్యాణి, కర్రి సత్యవతమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, నీలం సత్యంనాయుడు, వైశ్యరాజు గోవిందరాజు, ఎంపీడీవో జయంత్‌ప్రసాద్, తహసీల్దార్ చందక సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

సీతంపేట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గురువారం సోమగండిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ తదితర పత్రాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్ రుతోని, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, సీఎస్‌డీటీ మధుసూదనరావు, వీఆర్‌వో అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హతే కొలమానంగా సంక్షేమ లబ్ధి

పాలకొండ రూరల్: అర్హతే కొలమానంగా సంక్షేమ లబ్ధిని అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. గురువారం చిన్న మంగళాపురంలో సర్పంచ్ గోగుల కళ్యాణి అధ్యక్షతన ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తుదారులకు అవసరమైన ధ్రువపత్రాలు అందించారు. మండలంలోని వాటపాగులో సర్పంచ్ వావిలపల్లి రాజారావు నేతృత్వంలో ఈ కార్యక్రమం ద్వారా అర్జీదారులకు అక్కడి సచివాయం వద్ద ధ్రువపత్రాల పంపిణీ జరిగింది.



భామిని: సమావేశంలో మాట్లాడుతున్న తోట సింహచలం, చిత్రంలో జెడ్పీటీసీ చిన్నమ్మి



పాలకొండ రూరల్: చిన్న మంగళాపురంలో అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, ఎంపీటీసీలు మజ్జి నవీన్‌కుమార్, పానీ సాయిరాం, అట్టలి సర్పంచ్ కనుముల సంధ్యారాణి, డీసీసీబీ డైరెక్టర్ బంకి లక్ష్మణమూర్తి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కనుముల కల్పన, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, డొంక త్రినాధులు, ప్రత్యేకాధికారి ప్రభాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అన్ని పత్రాలు అందజేత

భామిని: మండలంలోని చిన్నదిమిలి, బొడ్డగూడ సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీవో జి.చంద్రరావు, తహసీల్దార్ ఎన్.అప్పారావు సారధ్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జెడ్పీటీసీ బొడ్డేపల్లి చిన్నమ్మి, సర్పంచ్‌లు లోతుగెడ్డ రవికుమార్, పార్టీ నాయకులు అగతముడి రఘుపతినాయుడు, వలరౌతు రామకృష్ణ, కొండగొర్రి మంగమ్మ, బిడ్డిక అనంతరావు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: కన్నపుదొరవలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీటీసీ, అధికారులు

ధ్రువపత్రాల పంపిణీ

జియ్యమ్మవలస: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కన్నపుదొరవలస, పెదమేరంగి గ్రామాలలో పెండింగ్ ధ్రువపత్రాలను ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, తహసీల్దార్ కేవీ సీతారామయ్య ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. కన్నపుదొరవలసలో ఎంపీటీసీ రెడ్డి రవికుమార్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వీరఘట్టం: సంత-నర్సిపురంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న డ్వామా పీడీ కిరణ్ కుమార్

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



సదునుగూడ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లక్కగూడ పంచాయతీ సదునుగూడ గ్రామానికి వెళ్లే రహదారిలో బీటీ రోడ్డు నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం భూమి పూజ చేశారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.75 లక్షలు కిలో మీటరు పొడవైన ఈ రోడ్డు నిర్మాణానికి మంజూరైందని ఎమ్మెల్యే చెప్పారు. సదునుగూడ గ్రామస్తులకు చిరకాల స్వప్నంగా నిలిచిన రోడ్డును జగనన్న ప్రభుత్వం నిజం చేసిందని, రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే గ్రామస్తులతో అన్నారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరుస్తూ.. రోడ్డు నిర్మాణం చేపడుతుండటం సంతోషదాయకమంటూ ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. దీనికి ముందు భూమి పూజ చేసేందుకు విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులంతా ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, జెడ్పీటీసీ మండంగి రాధిక, లక్కగూడ సర్పంచ్ బిడ్డిక సూర్యారావు, పార్టీ నాయకులు నిమ్మక గోపాల్, వహీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'జగనన్న సురక్ష'

● వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా సాగుతుందని వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. చినమేరంగిలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అర్హత ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందకుంటే నేరుగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పొందవచ్చన్నారు. ఆధార్ లింకేజీ, ప్రభుత్వ పథకాలు అందుకోవడంలో సమస్యలు, ఆదాయ, కుల, వివాహ తదితర ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చన్నారు. కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తుందన్నారు. మధ్యవర్తిత్వం లేకుండా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అవిశ్రాంతంగా పని చేస్తున్న వలంటీర్లే కారణమని కొనియాడారు.

టీడీపీ పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యం

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఒబ్బంగి పంచాయతీ బీముపురం వద్ద వంతెన నిర్మాణానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: రాష్ట్రంలో టీడీపీ పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఒబ్బంగి పంచాయతీ భీముపురం గ్రామ సమీపంలో ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ రూ.80 లక్షలతో వంతెన నిర్మాణం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.60 లక్షలతో గానలి గిరిజన గ్రామ జంక్షన్ నుంచి లిక్కిడి గ్రామం వరకు బీటీ రహదారి నిర్మాణ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యమని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో గిరిజనులకు విద్య, వైద్యం సకాలంలో అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకాలమ్మ, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, బిడ్డిక రాజేశ్వరి, విద్యారాణి, పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మల వెంకటరావు, నీలకంఠాపురం సర్పంచ్ మన్మధరావు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షేక్ నిషార్, మైనార్టీ సంఘ నాయకులు షేక్ నూరెల్లా, షేక్ ఆదిల్, శ్రీధర్, ఆకుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్



స్ప్రేయింగ్ పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం దోమల నివారణ మందును మలేరియా నివారణా శాఖ ఆధ్వర్యంలో పిచికారీ చేశారు. ఐఆర్‌ఎస్, ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని ఐటీడీఏ, గిరిజన సంక్షేమ కార్యాలయం, ఐసీడీఎస్, మండల రెవెన్యూ కార్యాలయాల్లో స్ప్రేయింగ్ చేశారు. దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భాను ప్రతాప్, సబ్‌యూనిట్ అధికారి జె.మోహన్‌రావు పర్యవేక్షించారు.

ప్రభుత్వ భవనాలు త్వరగా పూర్తి చేయాలి : పీవో



రెవెన్యూ అధికారుల నుండి వివరాలు తెలుసుకుంటున్న పీవో కల్పనాకుమారి

పాలకొండ రూరల్: ప్రజలకు మెరుగైన సేవలు గ్రామ స్థాయిలో అందుబాట్లోకి తీసుకువచ్చేందుకు నిర్మిస్తున్న సచివాలయ, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలు సకాలంలో పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. పాలకొండ మండలం అంపిలి, గోపాలపురం తదితర గ్రామాల్లో గురువారం పర్యటించిన పీవో అక్కడ నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ భవనాలను సందర్శించి వాటి పురోగతిపై అధికారులను ఆరా తీశారు. శాశ్వత ప్రాతిపదికన సేవలు అందించే ఈ భవనాల నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లోపాలు గుర్తిస్తే సహించమని, చివరి దశలో ఉన్న నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పట్టణ పరిధిలో ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించిన పీవో ఈ స్థల వివాదం కోర్టులో ఉన్న క్రమంలో వాటి వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట గిరిజన సంక్షేమ శాఖ ఈఈ సింహాచలం, స్థానిక తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

కళ్ల కలకలపై తస్మాత్...



విద్యార్థినుల గదులు పరిశీలిస్తున్న వైద్యాధికారి

సీతంపేట: కళ్ల కలకలపై అప్రమత్తంగా ఉండాలని దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్ సూచించారు. స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల, కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. కళ్ల కలకలతో బాధపడుతున్న వారిని పరీక్షించి వైద్యసేవలు, మందులు పంపిణీ చేశారు. ఆహార నియమాలు వివరించారు. విద్యార్థినులు ఉంటున్న గదులు పరిశీలించారు.

నాగరలో 104 వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకట హర్ష

కురుపాం: మండలంలోని మరిపిల్లి పంచాయతీ నాగర గిరిజన గ్రామంలో 104 వైద్య సేవలను మొండెంఖల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెంకటహర్ష 73 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల సరఫరా చేపట్టారు. కళ్ల కలకలు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలం దృష్ట్యా కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. 104 సిబ్బంది, స్థానిక ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల ఆందోళన

భామిని: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు గురువారం నిరసన తెలిపారు. అర్హత ఉన్న వీఆర్‌ఏలకు వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించాలని, డీఏలతో కూడిన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నీలాపు అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బుడుమూరు మిన్నారావు, నిమ్మల కర్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన : డీఐవో



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డీఐవో డాక్టర్ జగన్‌మోహన్‌రావు

కొమరాడ: సీజనల్‌గా వచ్చే వ్యాధులపై విద్యార్థులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. కళ్ల కలకలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయిచాలని వైద్య సిబ్బందిక సూచించారు. హెచ్‌ఎం వెంకటనాయుడు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచ్ భర్త మిన్నారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని కేదారిపురం సర్పంచ్ తాడంగి తులసమ్మ భర్త మిన్నారావును కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మిన్నారావుకు కలిగిన అస్వస్థత, తీసుకుంటున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిస్తూ, సకాలంలో కోలుకోవాలంటూ ఆకాంక్షించారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక తదితరులున్నారు.

సచివాలయ నూతన భవనం ప్రారంభం



సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని సోమగండి గ్రామ సచివాలయ నూతన భవనాన్ని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రజా పరిపాలనలో సమూలమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్ రుతోని, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, పీఆర్ డీఈ లోకనాథం, ఏఈ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటా సర్వే

భామిని: ఓటర్ల జాబితా సరి చేసేందుకు శుక్రవారం నుంచి సర్వే చేయాలని తహసీల్దార్ అప్పారావు సూచించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఇంటింటా సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. డీటీ నిమ్మల శేఖరం పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే జగనన్న ధ్యేయం

● పాలకొండ ఎమ్మెల్యే కళావతి



అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: రాష్ట్ర ప్రజలందరి సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పులిపుట్టి గ్రామ సచివాలయం పరిధి కొత్తగూడ, ఇప్పగూడ, బూర్జమానుగూడ, కల్లంగూడ, ముకుందాపురం, కె.గుమ్మడ, బిల్లమడ, పీపీ ఈతమానుగూడ పరిధిలోని పలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లారు. వీరికి గిరిజన మహిళలు ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పథకాల కరపత్రాల ద్వారా గడప గడపకు ఎంత మొత్తం అందిందో వివరించారు. తాత, అవ్వ పింఛన్ అందుతుందా...., అమ్మా.. అమ్మ ఒడి డబ్బులు పడ్డాయా.... అన్నా రైతు భరోసా వచ్చిందా...అక్కా చేయూత డబ్బులు బ్యాంకు ఖాతాలో జమయ్యాయా అంటూ ఒక్కొక్కరిని ఎమ్మెల్యే ఆప్యాయతతో పలకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఇంకా ఏమైనా పెండింగ్ సమస్యలు ఉంటే వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే పరిష్కారమౌతాయన్నారు. వలంటీర్‌లను సేవకులుగా గుర్తించాల్సింది పోయి, వారిపై ఆరోపణలు చేస్తున్నారని, అలాంటి వారిని ప్రజలు క్షమించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.వెంకటేష్, కృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల భోజనాల తీరుపై అసంతృప్తి

భామిని: స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా గురుకులాల డీసీవో టి.పద్మజ గురువారం సందర్శించారు. నిర్వహణ తీరుపై మండి పడ్డారు. గురుకులంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు, విద్యార్థుల సంఖ్యకు, వండిన వంటలకు సరిపోవడం లేదని మందలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. బోధనాంశాలు, మెనూ అమలుపై ఆరా తీశారు. నిలువ చేసిన సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. గుడ్డు సైజ్‌పై నిలదీశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ విజయనిర్మల, బోధనా సిబ్బంది ఉన్నారు.